

# దేవుడి పెళ్ళి

ఇంటి ముందు వేపచెట్లు తలలూపుతూ వుంటే గాలి తెరలుతెరలుగా చల్లగా వీస్తోంది.

ఒక రోజు గడిచిపోయిందనే ఆనందంతో కాబోలు చెట్లమీద పక్షులు కలకలారవాలు చేస్తున్నాయి

ఎక్కడో కోయిల మామిడి చిగురు మెక్కి మత్తుగా కుహూరవాలు చేస్తోంది

ఆరుబైట పడక్కుర్చీలో పడుకుని చుట్ట కాల్చుకుంటూ తన్మయావస్థలో వున్నాడు వెంకట్రామయ్య.

చొప్ప ముక్కలుచేసి పశువులకు వేస్తున్నాడు నారయ్య.

ఎద్దుల మెడలో మువ్వల చప్పుడు వినిపిస్తోంది.

---

**1979** చక్రపాణి ఐదవ అవార్డు పొందిన కథ

వీధిలో మేకలు గంతులేస్తూ వరి గెత్తుతున్నాయి.

నారయ్య చేతులు కట్టుకుని వెంక ట్రామయ్య ముందు నిల్చున్నాడు.

"ఏరా!...?" అన్నాడు వెంకట్రా మయ్య.

"పిల్లదానికి పెళ్ళి కుదిరిందండీ...." తల గోక్కుంటూ అన్నాడు నారయ్య.

"ఎక్కడా?"

"నా బొమ్మర్ది లేడండీ నారాయుడు. అది కొడుక్కయ్యా!"

"అట్టాగా."

"మరేనండి''

"ఏవంటా వయితే!"

"పైకం కావాలయ్యా!"

"ఏంటీ? పైకవా!?"

"మూడొందలు కావాలయ్యా!"

"పైకం నాదగ్గిరెక్కడుందిరా నీ పిచ్చిగాని. మూడేళ్ళ బట్టీ తుఫాన్లొచ్చి పంట చేతికి రాకుండా నోట్లో మట్టి పడిందా! ఈ యేదేగా కాస్తపండింది. నీకు తెలియదేవో!? బ్యాంకిలో పదివేలు అప్పుతెచ్చాను. ఎంత చెట్టుకి అంత గాలి అని అప్పు ఇచ్చేవాడుంటే అందరికీ కావాలి. రేపో మాపో బెంగుళూరు వెళ్ళాలి అమ్మాయి దగ్గరికి. ఖర్చులు ఎవడిస్తాడా అని ఎదురు చూస్తున్నాను. పేరు పెద్దాసామిదే గాని లాభం ఏవుంది!"

"అట్టాగంటే ఎట్టాగయ్యా! తవరివ్వకపోతే పెళ్ళవదు. తవరి కాళ్ళకాడ బతికే వోడిని."

నారయ్య కాళ్ళాగడ్డాలు పట్టుకుని బ్రతిమిలాడడం, వెంకట్రామయ్య డబ్బు లేదంటే లేదనడం గమనించి సుబ్బారావుకి చిరాకుపుట్టింది.

అయ్యగారు ఈరోజు చికాకుగా వున్నారు. రేపోమాపో సంతోషంగా వుండేప్పుడు అడుగుదాం అనే రేపటి ఆశతో వెళ్ళిపోయాడు నారయ్య.

నిద్ర మేల్కొంది మొదలు నిద్ర పోయే వరకూ తమ కుటుంబ సుఖం కోసం లాభంకోసం శ్రమించే నారయ్యకి పిల్ల పెళ్ళి చేసుకుంటానని అడిగితే ముష్టి మూడొందలు లేవనడానికి నోరెలా వచ్చిందో?

తండ్రి తత్వంమీద సుబ్బారావుకి కోపం వచ్చింది.

'ఈ వెధవలు కడుపు నిండితే వళ్ళొంచి పనిచెయ్యరు. అందుకే కడుపు నిండకుండా చూస్తుండాలి' అని తండ్రి అప్పుడప్పుడు అనే మాటలు జ్ఞాపకంవచ్చి అంత నిర్దయంగా ఎలా వుండగలరో అనుకున్నాడు.

గేటు చప్పుడైతే ఎవరా వచ్చింది అని చూశాడు సుబ్బారావు.

ఇంకెవరు. మునసబు, కరణం, పంచాయితీ మెంబర్లు బొజ్జలు వూపుకుంటూ వినాయకుడి సంతతి వాళ్ళలా వస్తు న్నారు.

"రండి....రండి. వూరకరారు మహాను భావులు" అంటూ నవ్వాడు వెంకట్రామయ్య.

"అరేయ్ సుబ్బా!....సుబ్బా! నాలుగు కుర్చీలు తెచ్చెయ్‌రా బాబూ!"అని కేకలు పెట్టాడు.

సుబ్బారావు కుర్చీలు వేశాడు,

"ఏవోయ్! బి. ఏ. ప్యాసయ్యావుగా ఎమ్.ఏ. చదువుతావా?" అన్నాడు మునసబు తేలుకొండిలాంటి మిసాలు మెలేసుకుంటూ.

"ఆఁ...." అన్నాడు సుబ్బారావు.

"వాడిదేంపోయింది. పెట్టుబడి పెట్టడానికి మనం వున్నాంగా ఒక్కో క్లాసు రెండేసేళ్ళు చదువుతాడు." విష్టాదంగా అన్నాడు వెంకట్రామయ్య.

"అట్లా చదవడమే మంచిదండి. పునాది గట్టిగా వుంటుంది." అన్నాడు కరణం.

ఆయన మాటలకి అంతా నవ్వారు.

"ఆ మాట నిజమే! ఇప్పుడంతా వానా కాలం చదువులే గదా!" అన్నాడు నాలుగు సార్లు మెట్రిక్ పరీక్షరాసి ప్యాసవలేక లాభంలేదని మానుకున్న పుల్లయ్య.

వాళ్ళ మాటలు వింటూవుంటే పుండు మీద కారం జల్లినట్లు మంటెక్కిపోతోంది సుబ్బారావుకి.

'అంతా దొంగముండా కొడుకులు నోట్లో బెల్లంపెట్టుకుని మాట్లాడతారు గాని కడుపు నిండా విషమే! ఇప్పుడెవరి కొంపకో నిప్పెట్టడానికి బయల్దేరారు' అనుకున్నాడు కసిగా.

వాళ్ళ సంభాషణ వినపడనంత దూరంలో వెళ్ళి కూర్చున్నాడు సుబ్బారావు.

పాండవుల్ని ఎట్లా గెలవాలా అని ఆలోచిస్తున్న కౌరవుల్లా అరగంట సేపు ఆలోచనచేశారు.

వాళ్ళు వెళ్ళిపోయాక "సుబ్బా!...." అని కేకేశాడు వెంకట్రామయ్య.

"ఏమిటి నాన్నా!"

"రేపు నేను అక్కయ్య దగ్గరికి వెళ్తున్నా గదా, నెలరోజులవరకూ రాను"

"——"

"వింటున్నావా"

"ఆఁ...."

"ఎల్లుండి గిరిరావు లారీ పంపిస్తానని చెప్పాడు. మిర్చి లోడింగ్‌చేసి గుంటూరు మార్కెట్టు యార్డుకి తీసుకెళ్ళు".

"ఆ....ఁ"

"డబ్బు బ్యాంకులో వెయ్యి"

"అందులో వెయ్యి నూట పదహార్లు శ్రీరామనవమి ఉత్సవాలకని మునసబు మావయ్యకి ఇవ్వు. రసీదు ఇస్తాడు తీసుకో!"

సుబ్బారావు షాక్ తిన్నవాడిలా బిగుసుకుపోయాడు.

నారయ్య కూతురు పెళ్ళికి మూడు వందలు అప్పు ఇవ్వలేనివాడు దేవుడి

పెళ్ళికి వెయ్యినూటపదహార్లు చందా ఇవ్వడానికి మనస్సెలా ఒప్పింది.

సుబ్బారావులో అంతః సంఘర్షణ మొదలైంది.

ప్రతి సంవత్సరమూ దేవుడికి పెళ్ళెందుకు చేస్తారు? దేవుడెందుకు చేసుకుంటున్నాడు.

ఒకవైపు జనం కూడు నీళ్లులేక అన్నమో రామచంద్రా అని అలమటిస్తుంటే, మానం దాచుకోడానికి గుడ్డలేక చినిగి పీలికలైన బట్టలువుండీ లేనట్లుగా వేసుకుని తిరుగుతుంటే, ఎండకీ, వానకీ, చలికీ తట్టుకోలేక చెట్లుక్రింద, పుట్ట క్రిందా ప్లాట్ ఫారాల మీదా ఇళ్ళులేక చస్తూవుంటే దేవుడు మాత్రం జనం ఏమైపోతే నాకేం అన్నట్లు రంగరంగ వైభవంగా వూరూరా, పేటపేటనా కోట్లు ఖర్చుపెట్టి పెళ్ళి చేసుకుంటున్నాడు.

దేవుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తాడనీ, చేశాడనీ హరికథలు, బుర్ర కథలూ చెప్పిస్తారు. అంతవరకే. దేవుడు చెప్పింది మాత్రం ఆచరించరు. చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకున్నట్లు బ్రతికిపోతున్నారు.

దేశంలో ఎందరో తమ పిల్లలకి పెళ్ళి చెయ్యలేక త్రిశంకు స్వర్గంలో వ్రేలాడుతున్నారు. దేవుడి పెళ్ళిరోజు బీదవాళ్ళకి పెళ్ళిళ్ళు చేయాలి. అప్పుడే దేవుడి పెళ్ళికి అర్థమూ పరమార్థమూ వుంటుంది. నారయ్యలాంటి నిస్సహాయులు నిర్భాగ్యులు ఎంతో సంతోషిస్తారు

అంతేగాని ప్రతి ఏడూ మునసబు దంపతులో, కరణం దంపతులో, ప్రెసిడెంట్ దంపతులో పీటలమీదకూర్చుంటే ఎవడిని వుద్ధరించినట్లు ?

* * *

"అవున్రా బాబూ! నువ్వు చెప్పింది బాగానే వుంది, కాని జనం ఒప్పుకుంటారా!"


"ఒప్పిద్దాం. మంచిపని చెయ్యదల్చుకున్నప్పుడు పట్టుదల కావాలి గాని అసాధ్యం ఏముంది!" అన్నాడు సుబ్బారావు.

"జనం కాదురా ఒప్పుకోవాల్సింది. ఊళ్ళో పెద్ద తలకాయలు." ఎవరో అన్నారు.

మనవంతా వెళ్ళి మాట్లాడదాం, వాళ్ళంతా ఇప్పుడు పంచాయితీ ఆఫీసు ముందు చేరివుంటారు. పదండి" అన్నాడు సుబ్బారావు.

గాంధీ యువజనసంఘం మెంబర్లంతా సుబ్బారావు నాయకత్వంలో పంచాయితీ ఆఫీసుకి వెళ్ళారు.

"మన ఆచారాలు, కట్టుబాట్లు ఎప్పుడో పురాణకాలంలో ఆనాటి పరిస్థితులను బట్టి ఏర్పరిచారు. వాటినే గుడ్డిగా అనుసరిస్తూ పోతుంటే ఇక ప్రగతి ఏముంది? కాలానుగుణంగా మన అలవాట్లు ఆచారాలు మార్చుకోవాలి.




ఎప్పటినుంచో మనం దేవుడికి పెళ్ళి చేస్తున్నాం. అదొక అనాది ఆచారంగా వస్తోంది. అందువల్ల పెద్ద ప్రయోజనం ఏం వుంది ఈ రోజుల్లో. అందుకే దేవుడి పెళ్ళి రోజు పెళ్ళిచేసుకోలేని బీదవాళ్ళకి మన ఖర్చుతో పెళ్ళిళ్ళు చేస్తే ఎంతో బాగుంటుంది."

సుబ్బారావు మాటలు విని ఏదో ప్రమాదం ముంచుకొచ్చినట్లు పెద్ద తలకాయలన్నీ అదిరిపడ్డాయి.

మునసబుగారు కరణంగారి ముఖం, కరణంగారు ప్రెసిడెంటుగారి ముఖం, ప్రెసిడెంటు పంచాయితీ మెంబర్ల ముఖం, వాళ్ళు వీళ్ళ ముఖాలు. వీళ్ళు వాళ్ళ ముఖాలు చూసుకుంటూ మాటలు మర్చిపోయినవాళ్ళలా బెల్లం కొట్టిన రాళ్ళయిపోయారు.

"ఒరేయ్ సుబ్బారావూ? ఇది నీకు పుట్టిన బుద్ధేనా లేక ఎవరైనా చెప్తుంటే విన్నావా?" అన్నాడు తేలుకొండి మీసాల మునసబు.

"నాకే పుట్టింది. ఏం?"

"నీకెందుకు పుట్టిందీ బుద్ధి?"

"ఎందుకు పుట్టిందంటే ఏం చెప్తాం? ఎండ ఎందుకు కాస్తుంది? వాన ఎందుకు కురుస్తుంది? నది ఎందుకు పారుతుంది? గాలి ఎందుకు వీస్తుంది? అంటే ఎవరేం చెప్పగలరు?" అన్నాడు సుబ్బారావు.

ఇన్నాళ్ళూ మూగివాడనుకున్న వాడ్ని ఒక్కసారిగా మాట్లాడుతూ వుంటే ఆశ్చర్యంగా వింటున్నట్లు అంతా వూపిరి బిగపట్టారు.

"నీ తెలివికి సంతోషించాం గాని దేవుడికి పెళ్ళి ఎందుకు చేస్తారో మనమేం చెప్తాం. మనం మామూలు మానవులం. మనకి వేదాంతంలోని సూక్ష్మాలేమి తెలుస్తాయి? పెద్దవాళ్ళు ఎందుకు పెట్టారో? తాత ముత్తాతల

దగ్గర్నుంచి తరతరలుగా ఆచారంగా దేవుడికి కల్యాణం చేస్తున్నాం. ఆచారాలు నిలబెట్టుకోవాలి గదా," అన్నాడు కరణం గారు.

"ఆచారాలు మానుకోమని నేననడం లేదు కాకపోతే కొంచెం మార్పు తీసుకురావా లంటున్నాను. దేవుడి పెళ్ళితోపాటు బీదవాళ్ళకి పెళ్ళిళ్ళు చేస్తే ఎంతో మంచి పని అంటున్నాను. మనం ఎన్నో ఆ చా రా లు మార్చుతుంటూ వస్తున్నాం. అం దు లో ఇదొకటి." అన్నాడు సుబ్బారావు.

"వీడీమధ్య బె జ వా డో, హైదరా బాదో వెళ్ళి నాస్తికంవాళ్ళ మీటింగులు వినొచ్చినట్లున్నాడు. పిచ్చి పిచ్చి వాగుడు వాగుతున్నాడు." అన్నాడు ఎవరో బోర్డు మెంబరు.

"వాడు కుర్రాడు. వేడి రక్తం. ఎన్నెన్నో ఆలోచనలు వస్తుంటాయి. పెద్దవాళ్ళం వున్నావని చెప్తున్నాడు. తప్పేవుంది? చెప్పనీ. అం తే గా వి పేచీ ఎందుకు?" అన్నాడు మునసబు.

"పర్లేరా సుబ్బారావూ! దేవుడి పెళ్ళి చాలా రోజులుందిగా. నె మ్మ ది గా ఆలోచిద్దాం లే." అన్నాడు ప్రెసిడెంటు.

* * *

పెద్ద తలకాయలకి కు ర్ర వా ళ్ళ పద్ధతి నచ్చలేదు.

ఎందుకు నచ్చుతుంది? వాళ్ళకి దేవుడి పెళ్ళిచేశామని వూళ్ళో కీర్తి కావాలి. తద్వారా ఇంట్లోకి ఫలహారాలు ప్రసా దాలు చేరాలి.

'అంతేగాని ఇదెక్కడి గొడవ? దేవుడి పెళ్ళి వూళ్ళోవాళ్ళ డబ్బుతో చేసి సాంప్రదాయం నిలబెట్టి సరదా తీర్చుకోవాలి గాని బీదోళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యాలట. గాడిద గుడ్డు చెయ్యొద్దూ. అయినా ఆ సుబ్బిగాడికి దారుణమైన తెలివితేట లున్నట్లున్నాయే! వాడిమాటలు వింటే నెత్తిన గుడ్డేసుకోవాల్సిందే.'

"అలా కుదరదురా అబ్బాయిలూ. అనవాయితీ ప్రకారం రాములవారి గుడి దగ్గిర దేవుడి పెళ్ళి జరుగుతుంది" అని గట్టిగా చెప్పారు.

మునసబుగారి అబ్బాయి, కరణంగారి మేనల్లుడు, ప్రెసిడెంట్ బామ్మర్ది ఇంకా మోతుబరీ రైతుల పిల్లలు కొందరు పెద్దవాళ్ళతో కలిసిపోయేరు. 'పెద్దల మాట చద్దిమూట' స్లోగన్స్ చేశారు.

ఎక్కువమంది చిన్న రైతుల పిల్లలు, ఊళ్ళో అసంతృప్తి వర్గాలవారు సుబ్బా రావు పక్షం వహించారు. తను వూహిం చిన దానికంటే ఎక్కువ ప్రోత్సాహం లభించేసరికి సుబ్బారావుకి వుత్సాహం వచ్చింది.

రాములవారి గుడి దగ్గర కాకుండా వూరిమధ్య పందిరివేసి పోటీ కళ్యాణం చేయిస్తానని రంగంలోకి దిగాడు తంత్రి మునసబుకు ఇవ్వమని చెప్పిన వెయ్యి నూటపదహార్లు ఇవ్వలేదు. కళ్యాణానికి

మొదటి చందాగా తండ్రి పేరుతో జమ కట్టాడు. కుర్రాళ్ళంతా వూళ్ళో చందా లకు బయల్దేరారు. సుబ్బారావు విప్లవ ధోరణి నచ్చినవాళ్ళు ప్రోత్సాహం ఇచ్చారు.

పల్లెకు వెళ్ళారు కుర్రాళ్ళంతా. నారయ్య ఇంటిముందు కూడారు గూడెం వాళ్ళంతా. పోటీ కల్యాణం గురించి ఆ రోజు బీదవాళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యడం అంతా వివరంగా చెప్పాడు సుబ్బారావు.

క్షుధార్తుడిముందు పంచ భక్ష్య పరమాణ్ణం వడ్డించి నట్లయింది నారయ్యకి. నమ్మలేనట్లు చూశాడు దమ్మిడీ ఖర్చులేకుండా కూతురి పెళ్ళి జరిగిపోతుంటే అనందించనివాడెవ్వడు?

"మీది దొడ్డ మనసు బాబూ! మా కష్టాలు సూసీసూసీ సీరీ మాటంటు న్నారు. దేవుడి పెళ్ళితోపాటు మనుషుల పెళ్ళిచేస్తే మీ పెద్దోళ్ళు వూరుకుంటారా బాబూ!" అన్నాడు నారయ్య సందేహిస్తూ.

"వూరుకోకపోతే వురేసుకుంటారు." ఎవరో కుర్రాడు ఆవేశంగా అన్నాడు.

"అలాగంటే ఎట్టా బాబూ! నీళ్ళలో వుంటూ మొసళ్ళతో విరోధం పెట్టుకుంటే ఎట్టా?" అన్నాడు నారయ్య.

"నువ్వేం భయపడకు. దేవుడే దిగి వచ్చినా వెనక్కి తగ్గేదిలేదు. అటు సూర్యుడు ఇటు పొడిచినా పెళ్ళిళ్ళు జరిపించి తీరతాం. నారయ్యా! నీ కూతురికి బట్టలు, అల్లుడికి బట్టలు కొని పెడతాం. మంగళ సూత్రాలు కొంటాం. పళ్ళు ఫలహారాలు మా ఖర్చే. పెళ్ళయ్యాక పేదలకు అన్నదానం చేస్తాం. సరేనా?" అన్నాడు సుబ్బారావు.

నారయ్యతోపాటు అంతా ఆనందిస్తు న్నారు. కాని వాళ్ళకి వూళ్ళో పెద్దల్ని చూస్తే భయం. ఈ దుర్మార్గులు ఎప్పుడు ఎవరి మెడలో పసుపుతాడు తెంచుతారో! ఏ ఇంటికి నిప్పు పెడతారోనని గుండెల్లో దడ.

"అలా తెల్లముఖాలు వెయ్యకండి. దేవుడు పెళ్ళిరోజు ఎంతమంది పెళ్ళిళ్ళు చేసుకున్నా ఖర్చు మాదే. సంబంధాలు చూసుకుని మాకు చెప్పండి చాలు." అన్నాడు సుబ్బారావు.

* * *

కుర్రాళ్ళంతా సంఘం ఆఫీసులో కూర్చుని వసూలైన డబ్బు కొనవలసిన సామాను వగైరా లెక్కలు చూసుకుం టున్నారు.

ప్రెసిడెంటు కొడుకు శేఖర్ నెమ్మదిగావచ్చి బల్లమీద కూర్చున్నాడు.

"ఏరోయ్ శేఖర్. ఈ మధ్య రావడంలేదే. మీ నాన్న వద్దన్నాడా ఏం?"

"అవున్రా! ఏం చెయ్యను చెప్పు?" నీరసంగా అన్నాడు శేఖర్.

"పోన్లే నువ్వేం చేస్తావులే. తండ్రి చాటు బిడ్డవి." అంతా నవ్వారు.

"తొందరగా వెళ్ళిపోరా నాయనా! ఎవరైనా చూస్తే మీ నాన్నకి చెప్తారేమో!"

"అది కాదురా. ఒక ముఖ్యమైన సంగతి చెప్పాలని వచ్చా!" గొంతు తగ్గించి అన్నాడు శేఖర్.

"ఏవిట్రా అది?" అడిగాడు సుబ్బారావు.

"మునసబు లేడూ?"

"వున్నాడు. ఎందుకు లేడూ?"

"పోయాడా పాపం!"

"అది కాదురా. మునసబూ మా నాన్నా గుసగుస లాడుకుంటున్నార్రా. మీరు చేసే దేవుడిపెళ్ళి జరక్కుండా చేయాలని ఆలోచిస్తున్నారు. నేనంతా చాటునుంచి విన్నాను."

"ఏం చేస్తారేం?" తీవ్రంగా అన్నాడు సుబ్బారావు.

"ఏమోరా. నాకు భయంగా వుంది." మునసబు ఏమో దేవుడి పెళ్ళి ఎట్టా చేస్తారో చూస్తాగా అని పళ్ళు నూరుతున్నాడ్రా! మా నాన్నేమో వాళ్ళ ముఖం చేస్తారు అన్నాడు."

"తర్వాత."

"పెద్దంతరం చిన్నంతరం లేకుండా మనమీదే పోటీకి వస్తారా! మహా మహా వాళ్ళే ఎగిరిపోయారు. వీళ్ళొక లెక్కా జమా! అంటున్నాడు మునసబు. మా నాన్నేమో సమయానికి వెంకట్రామయ్య గూడా లేడే, వుంటే ఈ సుబ్బిగాడి ఆటలు సాగేవి కాదు అన్నాడు. మునసబేమో 'ఇప్పుడు మాత్రం సాగనిస్తామా! రేపు కళ్యాణ మనగా మసి అని నవ్వుతున్నాడ్రా!" అని ఆగాడు శేఖర్.

"కొంపదీసి పందిరి తగలబెట్టిస్తాడా ఏం?" అన్నాడు ఒకడు.

"ఖూనీలు చేయించేవాడికి తగలబెట్టించడం ఒక లెక్కా జమా?"

కుర్రాళ్ళు రకరకాలుగా అన్నారు అక్కసు కొద్దీ.

"ఇదంతా నేను చెప్పానని ఎవరికీ చెప్పకండిరా. మా నాన్నకి తెలిస్తే తాట వలుస్తాడు." అంటూ జారుకున్నాడు శేఖర్.


సుబ్బారావు ఆలోచించి ఆలోచించి "మొత్తానికి ఏదో పెద్ద ప్లానే వేస్తారు." అన్నాడు.

"మరేం చేద్దాం?"

"వాళ్ళేం చెయ్యబోతారో మనకి తెలుసు. దౌర్జన్యానికి దౌర్జన్యమే జవాబుకాదు. అందువల్ల వుపయోగం లేదు. టౌన్‌లో మా గురువొకడున్నాడు. వాడొక కవిలే. వాడి సలహాతో ఎత్తుకు పైఎత్తు వేద్దాం. వీళ్ళ ఆట కట్టిద్దాం అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

* * *

శ్రీరామనవమి వారంరోజుల దగ్గరికి వచ్చింది రాములవారి గుడి దగ్గిర అట్టహాసంగా పెద్ద తాటాకుల పందిరి వేశారు.



ప్రెసిడెంట్ దంపతులు పీటలమీద కూర్చుని కళ్యాణం జరిపిస్తారని శుభ లేఖలు గూడా అచ్చయ్యాయి.

కాని పోటీ పెళ్ళివారు ఏం చేస్తున్నారో ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఊరిమధ్య కళ్యాణం అంటున్నారు గాని పందిరివేసే ప్రయత్నాలే లేవు కథా నాయకుడు సుబ్బారావు వారం రోజుల్నుంచీ వూళ్ళో లేడు. ఏ వూరు వెళ్ళాడో ఎవరికీ తెలియదు.

వీళ్ళని నమ్ముకుని పల్లెలో పదిమంది హడావిడిగా పెళ్ళి సంబంధాలు కుదుర్చుకుని ఆశతో ఎదురుచూస్తున్నారు. కావలసిన సరుకులు టౌన్ నుంచి తెస్తానని వెళ్ళిన సుబ్బారావు ఇంకా ఎందుకు రాలేదో ఎవరికీ అంతుబట్టలేదు.

'కొంపదీసి టౌన్ వెళ్ళినవాడిని అక్కడే చంపించలేదు గదా. ఈ వూళ్ళో ఘరానా పెద్దలు తల్చుకుంటే చెయ్యలేంది ఏముంది? అటువంటి పనులు వీళ్ళకి వెన్నతో పెట్టిన విద్య.'

అనుమానం పెనుభూతమై ఆ నోటా

ఈ నోటా వూరంతా భగ్గుమని గగ్గోలు పుట్టింది సుబ్బారావుని మునసబు, ప్రెసిడెంట్లు కలిసి చంపించారని.

సుబ్బారావు ఇంట్లో ఏడుపు పెడబొబ్బలు వూరంతా విన్పించాయి. ఆమె తల్లి శోక దేవతై పోయింది.

ఊళ్ళో కుర్రాళ్ళు కారాలు మిరియాలూ నూరుతున్నారు. ఆవేశాలూ కావేశాలూ పెచ్చు పెరిగిపోతున్నాయి.

ఊరి పెద్దలమీద ద్వేషం ఆకాశాన్నంటుతోంది.

పనిలో పనిగా సుబ్బారావు మేనమావ రాబోయే పంచాయితీ ఎలక్షన్లు దృష్టిలో పెట్టుకుని కులం ఫీలింగ్ తెచ్చి కులం వాళ్ళని రెచ్చగొట్టసాగాడు.

టౌన్‌నుంచి ఎప్పుడే వార్త వస్తుందోనని అంతా ఎదురు తెన్నులు చూస్తున్నారు. సుబ్బారావుని వెతకడానికి వెళ్ళిన కుర్రాళ్ళు ఇంకా రాలేదు.

సుబ్బారావు శవం వూళ్ళోకి వచ్చిందా వూరు వూరే స్మశానమై పోతుంది అనుకుంటున్నారు పల్లెలో వాళ్ళు.

ప్రెసిడెంటు మునసబులతో సహా పంచాయితీ బోర్డు మెంబర్లంతా తారెత్తిపోతున్నారు. నిప్పు లేని పొగలా ఇదెక్కడి గొడవరా బాబూ అని హడిలిపోసాగారు.

అప్పటివరకూ ఒకమాదిరిగా కాస్తున్న ఎండలు తీక్షణంగా మారి ఎండాకాలం వచ్చింది జాగ్రత్త అని హెచ్చరించాయి ఎండలు తీవ్రంగా కాస్తున్నట్లే వూళ్ళో వాతావరణం గూడా వేడిమీద వుంది.

సరిగ్గా అటువంటి సమయంలోనే సుబ్బారావు వూళ్ళోకి వేంచేశాడు.

గాంధీ యువజన సంఘం ముందు కుర్రాళ్ళంతా సుబ్బారావుకి జేజేలు కొడుతుంటే వూళ్ళో పెద్దలు అప్పుడు వూపిరి పీల్చుకొని 'హమ్మయ్య' అనుకున్నారు.

యువజన సంఘం తరపున మూరెడు పొడుగున్న కరపత్రాలు వూళ్ళో ఇంటింటికీ పంచారు.

'దేవుడి పెళ్ళితోపాటు పది జంటలకు పెళ్ళి జరగబోతుంది. ఆ పెళ్ళికి పెద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి. ఆయన కళ్యాణం స్వయంగా పర్యవేక్షించి ముఖ్య అతిథిగా వ్యవహరించి బీదలకు పెళ్ళిళ్ళు జరిపిస్తారు. నూతన శకానికి నాంది పలుకుతారు.

'ఓర్నాయనో సుబ్బారావు కుర్రాడు కాదురా చిచ్చర పిడుగు.'

'పిట్ట కొంచెము కూత ఘనము.'


'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది.'

'మనవాడు రాజకీయాల్లోకి దిగితే తొందర్లోనే ఢిల్లీలో పాగా వేసేస్తాడు'

ఊళ్ళో ఎవరినోట విన్నా పొగడ్తలే.

* * *

ఆ రాత్రి సుబ్బారావు చాలా ప్రొద్దు




బోయి ఇంటికి వచ్చాడు. గేటు తీస్తుండగానే గోడగడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

అరుబైట కూర్చున్నవాళ్ళని చూసి షాక్ తన్నవాడిలా నిలబడిపోయాడు సుబ్బారావు.

పడక్కుర్చీలో పడుకుని చుట్ట కాల్చుకుంటున్నాడు ప్రెసిడెంటు. ఆయనగారి చుట్టూ కుర్చీలమీద మునసబు కరణమూ, పంచాయితీ బోర్డు మెంబర్లూ మూగి వున్నారు.

"ఇప్పుడు దాకా ఎక్కడున్నావురా సుబ్బూ? మావయ్యా వాళ్ళు నీకోసం వచ్చి ఏంతసేపైందో," అంటూ మందలించింది తల్లి.

"అలా నిలబడిపోయావేరా సుబ్బారావూ! రా....కూర్చో." అన్నాడు తేలుకొండి మీసాల మునసబు.

తర్వాత రాజీ కుదిరింది.

ఊళ్ళో దేవుడికి రెండు పెళ్ళిళ్ళు జరగబోవడంలేదు. రాములవారి గుళ్ళోనే దేవుడి పెళ్ళి మిగతా పెళ్ళిల్లు జరుగుతాయి. అంతా సుబ్బారావు యిష్టప్రకారమే.

ముఖ్యమంత్రికి పూలదండలు ఎప్పుడెప్పుడు వేద్దామా, ఫోటోలు ఎప్పుడు తీయించుకుందామా అని గ్రామదేవతలు వుబలాటపడసాగారు.